క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్

అద్దంకి: స్థానిక కోర్టు సముదాయంలో బుధవారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఅదాలత్‌లో రాజీ చేసుకోదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. కక్షిదారులు అధిక సంఖ్యలో హాజరై అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయోజనాల కోసమే రహదారుల విస్తరణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పర్చూరు (చినగంజాం): జాతీయ ప్రయోజనాల కోసమే రహదారుల విస్తరణ జరుగుతుందని బాపట్ల ఆర్డీవో జీ రవీందర్ అన్నారు. రహదారులు విస్తరిస్తే పరిశ్రమలు, కంపెనీలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. మంగళవారం పిడుగురాళ్ల–వాడరేవు జాతీయ రహదారి విస్తరణపై పర్చూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో అధికారులు సమావేశం నిర్వహించారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన పర్చూరు చెన్నుబొట్ల అగ్రహారం గ్రామాల రైతులు సమావేశానికి హాజరై అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు, భూ యజమానులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యశ్రీ, జాతీయ రహదారుల ఏఈ నవాజ్, గ్రామ సర్పంచ్ మల్లా అంజమ్మ, ఈఓఆర్డీ గౌస్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'నా మట్టి-నాదేశం'

చినగంజాం: ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి–నాదేశం కార్యక్రమాన్ని మండలంలో 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే స్వరూపరాణి తెలిపారు. 9వ తేదీ శిలాఫలకం, 10 వతేదీ వసుధ వందన్, 14న వీరోంకా వందన్, 15న జెండా ఆవిష్కరణ జాతీయ గీతం ఆలాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 9న సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, మోటుపల్లి పంచాయతీల్లో, 10న కడవకుదురు, పల్లెపాలెం, చినగంజాం, కొత్తపాలెం, 11న మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం, నీలాయపాలెంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఓటర్ల జాబితాలో అనర్హులపై దృష్టి సారించాలి

- కార్యకర్తలతో సమీక్ష సమావేశం
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్

యద్దనపూడి: దొంగ ఓట్లతో నియోజకవర్గంలో ఇప్పటివరకు టీడీపీ అక్రమ మార్గంలో గెలుస్తూ వస్తోంది.. రానున్న ఎన్నికల్లో టీడీపీ దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకట్ట వేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పూనూరు, గన్నవరం, యద్దనపూడి, యనమదల, అనంతవరం, పోలూరు, జాగర్లమూడి గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ 2013 అక్టోబర్ నుంచి తెలుగుదేశం నాయకులు గ్రామాల్లో సుమారు 37,800 దొంగ ఓట్లను మీసేవా, నెట్ సెంటర్ల ద్వారా బోగస్ ఓట్లు నమోదు చేయించుకున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది టీడీపీ కుట్రలు, కుతంత్రాలు బయటకు తీస్తాయన్నారు. ఎక్కడా ఏ చిన్నది ఘటన జరిగిన లేనిది ఉన్నట్టుగా చేసి అబద్దపు ప్రచారం చేస్తుందన్నారు. టీడీపీ ముందు నుంచి దొంగ ఓట్లపై ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. అప్పట్లో ఓటు హక్కుకు అర్హులైన వారికి ఓటు కల్పించకుండా కుట్రలు చేసిందని ఆమంచి విమర్శించారు. ఎక్కడో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఇతర దేశాల్లో ఉన్న వారి పేరుతో ఓట్లు సృష్టించుకొని ఎన్నికల రోజు 70, 80 ట్రావెల్స్ బస్సుల్లో, వందలాది కార్లతో ఓటర్లను ఇక్కడకు తీసుకువచ్చి ఓట్లు వేయించుకుంటున్నారని తెలిపారు. ఇవన్నీ ఓటును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేస్తున్నప్పుడు ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి పౌరుడు ఓటుహక్కును వినియోగించుకోవటం ఎంత ముఖ్యమో.. ఎన్నికల నియమావళి ప్రకారం ఒకే వ్యక్తికి వేరువేరు ప్రాంతాల్లో ఓటు ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. ఇలా తెలుగుదేశం పార్టీ నాయకులు దొంగ ఓట్లు సృష్టించటం వల్లే 2014లో గొట్టిపాటి భరత్, 2019లో దగ్గుబాటి వెంకటేశ్వరావు పరాజయం పొందాల్సి వచ్చిందన్నారు. లేకుంటే 15 నుంచి 20 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలుపొందేవారన్నారు. మన పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరూ ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా సరే వెంటనే బీఎల్వోలకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. మన ప్రాంతాల్లో కొత్త ఓట్లు పొందడానికి అర్హులున్న ఓటర్లను దగ్గరుండి బీఎల్వోల ద్వారా అర్జీ పెట్టించాలన్నారు. ఎన్నికల సమయం దగ్గరగా ఉన్నందువల్ల ఈ నెల 21వ తేదీ లోపు దొంగ ఓట్ల సమాచార్ని సేకరించి బీఎల్‌ఓలకు అందజేయాలని కార్యకర్తలకు సూచించారు. సమాచారం అందించినా స్పందించని బీఎల్‌ఓలపై ఎన్నికల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకునేలా పోరాడదామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చుండి లక్ష్మినారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ ధూళిపాళ వేణు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే



పమిడిపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపకు మన ప్రభుత్వంలో కృష్ణచైతన్య

మేదరమెట్ల: మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే అని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ చెప్పింది చేసే ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని తాను ప్రకటించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రిని మరళా గెలుపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షం టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ గెలుపును ఆపలేదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ప్రభుత్వం మీద విష ప్రచారాలు చేయడానికి సిద్ధంగా ఉంటుదని విమర్శించారు. వీటిని మనం తిప్పికొట్టేందుకు మన కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పూటకో మాట, గంటకో అబద్ధంతో ప్రజల్ని మభ్యపెట్టడంలో చంద్రబాబుకు వెన్నుతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. గతంలో అలివికాని హామీలు ఇచ్చి నెరవేర్చామని గొప్పలు చెప్పుకున్న నీచ రాజకీయ పార్టీ టీడీపీ అని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ జెండాను రెపరెపలాడిస్తామని కృష్ణచైతన్య చెప్పారు. అనంతరం లబ్దిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మాజీ సర్పంచ్ రావిశ్రీధర్, స్థానిక నాయకులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

15 వరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

సంతమాగులూరు (అద్దంకి): ఆజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్ అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో మంగళవారం కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ నేటి నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించారని చెప్పారు. దాని ప్రకారం నేడు మండలంలోని అడవిపాలెం, వెల్లలచెరువు, కామేపల్లి, పుట్టావారిపాలెం, సంతమాగులూరు గ్రామ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, ఈ నెల 10న ఫత్తేపురం,బండివారిపాలెం, కొప్పరం, సజ్జపురం, మిన్నెకల్లు, తండేడుమల్లి, చవిటిపాలెం, గురుజేపల్లి, ఈ నెల 11న ఏల్చూరు, కొమ్మాలపాడు, మక్కెనేనివారిపాలెం, మామిళ్లపల్లి, కుందుర్రు, పరిటాలవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, ఆయా రోజుల్లో పంచప్రాణ ప్లెడ్జ్, నా నేల–నా దేశం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమాల్లో భాగంగా సైకిల్ ర్యాలీలు, మహిళల బైక్ ర్యాలీలు, ఫ్లాగ్ మార్చ్, చర్చలు, ముగ్గుల పోటీలు, రక్తదానం క్యాంపులను ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి నిర్వహించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో మట్టిని సేకరించి మండలానికి వలంటీర్ ద్వారా పంపాలన్నారు. వాటిని ఢిల్లీకి పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

అద్దంకి రూరల్: పట్టణంలో విద్యుత్ శాఖాధికారులు సిబ్బందితో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 1662 సర్వీసులు తనిఖీ చేయగా నాలుగు మాల్ ప్రాక్టీస్, 50 అధిక లోడు సర్వీసులను గుర్తించినట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్ మస్తాన్‌రావు తెలిపారు. అధిక లోడుగల గృహాలు, వాణిజ్య సర్వీసుల వినియోగదారులు స్వచ్ఛందంగా అందుకుగాను డిపాజిట్‌ను మీ–సేవలో రెగ్యులర్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ హైమావతి, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్లు టి. సత్యనారాయణ, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌గా వ్యాక్సిన్‌లు

బల్లికురవ: ప్రభుత్వం ఐఎంఐ మిషన్ ఇంద్ర ధనుస్సు వ్యాక్సిన్‌లను ఈనెల 7వతేదీ నుంచి 12వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌గా వేస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని 22 సచివాలయాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు వ్యాక్సిన్‌లు వేస్తున్నామని, ఈఅవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. వ్యాక్సిన్ వేయించుకోకపోతే రక్త హీనతతోపాటు అనారోగ్యం బారిన పడతారని వైద్యాధికారి తెలిపారు.

వీవర్స్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



మాస్టర్ వీవర్లతో మాట్లాడుతున్న నియోజకర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలో మాస్టర్‌వీవర్లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. చేనేతలను ఆదుకునేందుకు వారికి ప్రోత్సాహమిచ్చేందుకు నేతన్న నేస్తం ద్వారా ప్రతి ఏటా వారి ఖాతాలో నగదు జమ చేస్తున్నారన్నారు. అనంతరం పలువురు మాస్టర్ వీవర్లు మాట్లాడుతూ నూలుపై జీఎస్టీని రద్దు చేయాలని, ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా పవర్ లూమ్స్‌పై చేనేత కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. అలానే పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పద్మశాలి కార్పోరేషన్ డైరెక్టర్ గోలి కుమారి, గోలి ఆనందరావు, కాకుమాను రవికుమార్, నాగూర్, మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నరసింహారావు, గోలి వెంకటరత్నం, ఆకురాతి కోటేశ్వరరావు, గుజ్జల వెంకటేశ్వర్లు, గోలి జగదీష్, బిట్రా శ్రీను, మాచర్ల ఆంజనేయులు, దామర్ల శివయ్య, గోలి గిరిధర్, బండారు బాలనాగేశ్వరరావు, గంజి సుబ్బారావు, చేబ్రోలు కుమార్‌స్వామి, చాత్రాసి వేణు, పడవల వెంకటరత్నం, కటకం మధుసూదనరావు, దాశరథి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు వెళ్లెను.. సమస్య తీరెను

- తొలగిన మురుగు సమస్య
- ముమ్మరంగా దండుబాట ప్రధాన మురుగు కాలువ పూడికతీత పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు, పశుపోషకులు



కాలువలో పూడికతీత పనులు చేస్తున్న జేసీబీ



జమ్ము, తూటుకాడలను దగ్గరుండి తొలగిస్తున్న వార్డు ఇన్‌చార్జ్ అనిల్

చీరాల రూరల్: అభివృద్ధి బాటలో చీరాల మున్సిపాలిటీ ముందుకు దూసుకెళ్తోంది. ప్రధానంగా పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం ఇవేమి పట్టించుకోకుండా గాలికొదిలేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. పట్టణ శివారు ప్రాంతమైన దండుబాట రోడ్డులోని ప్రధాన మురుగు కాలువలో పూడికతీత పనులను స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి చొరవతో మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. ఎంతో కాలంగా కాలువలోని మురుగునీరు పేరుకుపోయి కదలక దుర్గంధం వెదజల్లేది. దానికితోడు కాలువలో ఏపుగా తూటుకాడలు, జమ్ము పెరిగిపోవడంతో కాలువదాటే సమయంలో పశువులు కాలువలో చిక్కుకుపోయి చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు రూ. 2 లక్షలు మున్సిపల్ నిధులు వెచ్చించి మురుగు కాలువను శుభ్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో సమీపంలోని కాలనీల ప్రజలతో పాటు పశుపోషకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన మురుగు కాల్వగా దండుబాట..

పట్టణంలోని గృహ సముదాయాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లలోని మురుగునీటిని చిన్నచిన్న కాలువల ద్వారా దండుబాట రోడ్డుకు తరలించేవారు. దండుబాట రోడ్డులోని ప్రధాన మురుగు కాలువలో మురుగు కలిసే ఏర్పాట్లు చేశారు. అయితే ఈ ప్రధాన మురుగుకాలువ చీరాలలోని కొత్తపాలెం పంచాయితీ, గాంధీనగర్, హౌసింగ్ కాలనీ, వైకుంఠపురం, బలహీనవర్గాల కాలనీ, విఠల్‌నగర్, పాలేటి నగర్, ఉజిలిపేట శివారు ప్రాంతం కారంచేడు ఎఫ్‌సీఐ గోడౌన్‌ల వరకు నిర్మించారు. అక్కడ నుంచి మరలా కాలువ ప్రారంభమై జాన్‌పేట, జయంతిపేట, ఐక్యనగర్, విజయనగర్ కాలనీ వెనుక నుంచి ప్రయాణించి ఈపురుపాలెం స్ట్రయిట్ కాలువలో కలిసే విధంగా అధికారులు అప్పట్లో చర్యలు చేపట్టారు. అయితే కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద నుంచి ఈపురుపాలెం స్ట్రయిట్ కాలువ రెండు కిలో మీటర్ల వరకు మురుగు కాలువకు పక్కన ప్రహరీ లేకపోవడం, కాలువలోని మురుగు నీరు సక్రమంగా ప్రవహించేందుకు సిమెంట్ బెడ్ నిర్మాణం లేకపోవడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. సమీపంలో నివాసముంటున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు దోమ పోట్లకు, పాము కాట్లకు గురవుతూ దుర్వాసనలు పీల్చలేక నానా ఇబ్బందులు పడేవారు. అంతేకాక కారంచేడు నుంచి ఈపురుపాలెం, బాపట్ల వెళ్లాలనుకునే ప్రయాణికులకు ద్విచక్రవాహనదారులకు దండుబాట రోడ్డు నుంచి చాలా అనువుగా దగ్గరగా ఉంటుంది. అందువలన ప్రయాణికులందరూ ఈ రోడ్డు మార్గాన్ని తమ ప్రయాణానికి ఎంచుకుంటారు. అదే కారంచేడు రైల్వే గేటు దాటి వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది.

అడిగిన వెంటనే సాయం..

దండుబాట రోడ్డు ప్రధాన మురుగు కాలువ సమస్యను ఎమ్మెల్యే కరణం దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ నిధులు కేటాయించి పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. దగ్గరుండి పనులను చేయించాలని ఆదేశించడంతో తాను అధికారుల వెంటనే ఉంటూ పనులను చేయిస్తున్నాం. అడిగిన వెంటనే నిధులు సమకూర్చి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్తున్నాం.

– నల్లూరి అనిల్, వైఎస్సార్ సీపీ నాయకుడు

రెండు వార్డులకు ఉపఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల



రామన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

వేటపాలెం: ఖాళీగా ఉన్న వార్డు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయింది. మండల పరిధిలోని రామన్నపేట గ్రామ పంచాయతీకి సంబంధించిన రెండు వార్డులకు ఉప ఎన్నికలు జరగనున్నాయని ఎంపీడీఓ కే నేతాజీ మంగళవారం తెలిపారు. రిటర్నింగ్ అధికారిగా వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్‌ని నియమించినట్లు చెప్పారు. గ్రామంలో మొత్తం 14 వార్డులు ఉండగా 6, 10 వార్డుల సభ్యులు అకాల మరణం చెందడంతో వారి స్థానంలో తిరిగి కొత్తగా సభ్యులను ఎన్నుకోవడం కోసం ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ వార్డు షెడ్యూలు తెగలు (ఎస్టీ) జనరల్‌కి, 10వ వార్డు వెనుకబడిన తరగతులు (బీసీ) జనరల్‌కి కేటాయించారన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీన వరకు నామినేషన్‌లు స్వీకరణ ఉంటుందన్నారు. రామన్నపేట కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంకాలం 5 గంటల వరకు నామినేషన్‌లు ఆర్ఓ స్వీకరిస్తారని తెలిపారు. ఈనెల 11న నామినేషన్ పత్రాలు పరిశీలన, 14న తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణ చేసుకోవచ్చని చెప్పారు. ఈనెల 19వ తేదీన మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించి తదనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక కోసం సమావేశం జరుగుతుందని తెలిపారు.

రోటరీ ద్వారా లక్ష మొక్కల పెంపకం



బంకమట్టితో సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న విద్యార్థులు

వేటపాలెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చీరాల రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం దేశాయిపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్, బంక మట్టి, నాలుగు రకాల విత్తనాలు కలిపి విద్యార్థులచే తయారు చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. రోటరీ అధ్యక్షుడు మాట్లాడుతూ బంక మట్టిలో విత్తనాలు ఉంచి సీడ్ బాల్స్ తయారు చేశామన్నారు. విద్యార్థుల ద్వారా రోడ్ల పక్కన ఖాళీ స్థలాల్లో వేస్తామని చెప్పారు. వర్షాలు పడినప్పుడు సీడ్‌బాల్‌లోని విత్తనాలు మొలకెత్తుతాయన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా చెట్లు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఇదే విధంగా అన్ని పాఠశాలల విద్యార్థులు ద్వారా సీడ్‌బాల్ పద్ధతిలో లక్ష మొక్కలు పెంచే విధంగా చేయడానికి రూపకల్పన చేశామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చీరాల కృష్ణమూర్తి, సీహెచ్ బాల వెంకటేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, డీవీ సురేష్, పోలుదాసు రామకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఎలుకల మందు తిని వైద్యశాలలో చికిత్స పొందుతున్న వివాహిత మంగళవారం మృతి చెందింది. ఎస్సై ఆదిలక్ష్మీ వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న మల్లెల నాగజ్యోతి (36)కి వెంకటేశ్వర్లతో 10 ఏళ్ల క్రితం వివాహం అయింది. ఒక కుమారుడు పుట్టిన తరువాత ఇరువురికి మరస్పర్ధలు రావటంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో మనస్థాపంతో రెండురోజుల క్రితం ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలో ఉన్న నాగలక్ష్మిని స్థానికులు గమనించి అద్దంకిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయింది. ఎస్సై కేసు నమోదు చేశారు.

దాతల సహకారం అభినందనీయం



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో

దగ్గుబాడు (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవోలు సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దగ్గుబాడు మొయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన పొన్నం శివకుమార్ ఫౌండేషన్ సహకారంతో గత 10 ఏళ్లకు పైగా ప్రతి కార్యక్రమాలు జరగడం సంతోషమన్నారు. 200 విద్యార్థులకు సామగ్రి అందించిన దాత పొన్నం శివకుమార్ ఫౌండేషన్ డైరెక్టర్ వెంకట్రావును వారు ఘనంగా సత్కరించి అభినంధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భవనం శ్రీనివాసరెడ్డి, సీహెచ్ మహాలక్ష్మమ్మ, బెనజీర్ భుట్టో, సుభానీ, పద్మనాగులు, నాగేశ్వరరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించాలి

చీరాల టౌన్: గర్బిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. మంగళవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గ్రామంలోని 23 మంది గర్బిణులు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ గర్బిణులకు 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటుగా పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యానశాఖ ద్వారా యంత్ర పరికరాలు

బల్లికురవ: ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఎస్సీ రైతులకు మినీ ట్రాక్టర్‌లు, తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తున్నారని మార్టూరు ఉద్యానవనశాఖాధికారి బీ. హనుమంత నాయక్ మంగళవారం తెలిపారు. తైవాన్ స్ప్రేయర్లకు రూ. 26 ఖర్చుకాగా రూ.10 వేలు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. నీటి గుంతకు రూ 1.5 లక్షలు ఖర్చు అవుతుండగా రూ. 75 వేలు సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. మినీ ట్రాక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని హనుమంతనాయక్ కోరారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

చీరాల టౌన్: గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి ఆదేశించారు. మంగళవారం హౌసింగ్ కార్యాలయంలో సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పనిసరి



నులిపురుగుల మాత్ర వేస్తున్న వైద్యులు

జే.పంగులూరు: చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివచెన్నయ్య తెలిపారు. మండల పరిధిలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆద్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జరిగింది. అనంతరం విద్యార్థులకు నులిపురుగులు వేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అద్దంకి రూరల్: వేరొక స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకుని భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి ఎస్సై ఆదిలక్ష్మీ కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని ఏలేశ్వరవారి పాలెం గ్రామానికి చెందిన చెంపిరి అశోకరాణికి మూడు నెలల క్రితం రాజీవ్ కుమార్‌తో వివాహం అయింది. రాజీవ్‌కుమార్ షాహిన్ అనే వేరే స్త్రీతో అక్రమ సంబంధం ఉండటం వల్ల అశోకరాణిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈక్రమంలో అశోక్‌రాణి వెళ్లి షాహిన్‌ను నిలదీయగా రాజీవ్‌కుమార్, షాహిన్‌లు అశోక్ రాణిపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.